

## నిత్యాన్నదాన పథకానికి విరాళం


అయినవిల్లి: శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి మాచిరాజు ఫణిరాజ్ కిరణ్ అనూష దంపతులు రూ.50 వేలు, కె.మోహన్ కృష్ణ దంపతులు రూ.లక్ష అందజేశారు.



## సుదర్శన హోమానికి విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నారసింహ సుదర్శన హోమానికి మాచిరాజు కుటుంబ సభ్యులు గురువారం రూ.లక్ష శాశ్వత విరాళం అందజేశారు.

## డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 3800,మధ్య డెల్టాకు 2400,పశ్చిమ డెల్టాకు 7000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భద్రాచలం వద్ద 25.90అడుగులకు నీటి మట్టం చేరింది.

## న్యూస్‌రీల్

### కొవ్వూరులో భారీ వర్షం

కొవ్వూరు: జిల్లా వ్యాప్తంగా గురువారం పలుచోట్ల వర్షం కురిసింది. రుతుపవనాలు నిష్క్రమించాక ఈసారి వర్ష ప్రభావం కనిపిస్తోంది. రాజమహేంద్రవరంతోపాటు పలు ప్రాంతాల్లో తెల్లవారుజామున భారీగా వాన పడింది. ఉదయం 8గంటలకు జిల్లాలో సగటున 14.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం 8-30గంటల వరకూ కొవ్వూరులో గరిష్ఠంగా 55.2 మి.మీటర్ల వర్షం కురిసింది. గోపాలపురంలో 42.6,నిడదవోలులో 20.8, రంగంపేటలో 39.8,రాజమహేంద్రవరం అర్బన్‌లో 29.6, గోకవరంలో 34.8, రాజమహేంద్రవరం రూరల్‌లో 12.4,కడియంలో 8.0,బిక్కవోలులో 1.8, రాజానగరంలో 1.2, సీతానగరంలో 1.8, ఉండ్రాజవరంలో 5.8,చాగల్లులో 3.4,నల్లజర్లలో 8.4, తాళ్లపూడిలో 3.2 మి.మీటర్లు చొప్పున వర్షం కురిసింది. గురువారం సాయంత్రం కూడా కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది.

### 1 నుంచి జిల్లా టీటీ జట్ల ఎంపికకు పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం సిటీ): జిల్లా టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు అక్టోబర్ 1వ తేదీ నుంచి స్థానిక టౌన్ హాల్ ఎదురుగా గల రాజమండ్రి గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీలో నిర్వహించనున్నారు. జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు జేవీవీ అప్పారెడ్డి గురువారం ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 బాల బాలికలు, స్త్రీ పురుషుల విభాగంలో పోటీలు నిర్వహించి జట్లను ఎంపిక చేస్తారన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన జట్లు అక్టోబరు 13వ తేదీ నుంచి 16 వరకు అనంతపురంలో జరిగే అంతర్ జిల్లా రాష్ట్ర టేబుల్ టెన్నిస్ పోటీల్లో తలపడతాయన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు తమ పేర్లను అసోసియేషన్ కార్యదర్శి వీటీవీ. సుబ్బారావును ఫోన్ నంబర్ 9347586233లో సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు.

### రూ.2.45 లక్షలు పలికిన గణనాథుని లడ్డు

యానాం: నియోజకవర్గ పరిధిలోని కనకాలపేట రామాలయం సెంటర్‌లో కొలువైన శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి మహా లడ్డు ప్రసాదానికి గురువారం వేలం పాట నిర్వహించగా రూ.2.45 లక్షలు పలికింది. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన కోన వీరవెంకట రామచంద్రరావు బ్రదర్స్, తోట మల్లికార్జునరావు, కోన జయరాజు లడ్డును కైవసం చేసుకున్నారు. వీరిని ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది.

### పతకాలపై గురి తప్పని తేజస్విని

జగ్గంపేట: కోల్‌కతాలో జాతీయిస్థాయిలో జరిగిన విలువిద్య పోటీలలో జగ్గంపేట ద్యార్థిని బండారు జోషిత సూర్య తేజస్విని అత్యంత ప్రతిభ కనబరిచింది. రెండు విభాగాలలో రజతం,కాంస్య పతకాలను కైవసం చేసుకుంది. పాఠశాలల క్రీడాపోటీలు సమాఖ్య అనుబంధ సంస్థ,సీఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో గేమ్స్,స్పోర్ట్స్-2023 ఈ నెల 28, 29తేదిలలో జరిగాయి. గురువారం జరిగిన అండర్ 19 విభాగంలో జోషిత 50మీటర్లలో రజత పతకాన్ని, 30మీటర్లలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. పతకాలతో పాటు ప్రశంసాపత్రాన్ని గురువారం అందుకుంది. తేజస్విని రాజమహేంద్రవరంలో ఫ్యూచర్ కిడ్స్‌లో ఇంటర్మీడియెట్ చదువుతోంది. ఈమె తండ్రి జగ్గంపేట మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా జోషితకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అభినందనలు తెలిపారు.

# ఆటోవాలా.. ఆనంద హేల

- నేడు వైఎస్సార్ వాహన మిత్ర సాయం జమ
- వరుసగా ఐదో విడత కూడా అమలు
- జిల్లా వ్యాప్తంగా 11,819 మందికి లబ్ధి
- నాలుగేళ్లలో రూ.51 కోట్ల సాయం
- ఆటో, క్యాబ్ డ్రైవర్ల హర్షాతిరేకం



కంబాల చెరువు(రాజమహేంద్రవరం సిటీ): లక్షలు ఖర్చు పెట్టుబడి పెట్టి వాహనాలు కొనుగోలు చేసి... రోజువారీ ఆదాయంతో జీవనం నెట్టుకు వస్తున్న చిన్నచిన్న వాహన యజమానులకు... వాహనాల పన్నులు, పెట్టుబడులు, బీమా ప్రీమియం చెల్లింపులు.. ఫైనాన్స్‌పై వాయిదాలు వంటివి భారంగా మారుతున్నాయి. ఇటువంటి వారికి ప్రభుత్వపరంగా చేయూత అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ వాహన మిత్రను ప్రవేశపెట్టింది. ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న డ్రైవర్లకు రవాణా శాఖకు సంబంధించి ఖర్చులు, చిన్నచిన్న రిపేర్లు చేసుకునే నిమిత్తం ఏటా రూ.10వేలు వంతున ఆర్థిక సాయాన్ని అందజేస్తోంది. సొంత వాహనం కలిగిన వారికి ఈ పథకంలో లబ్ధి చేకూరుతోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి వరుసగా ఏటా క్రమం తప్పకుండా అందజేస్తోంది. ఈ ఏడాది వాహన మిత్ర ప్రోత్సాహానికి విజయవాడలో ఈనెల 29న జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కనున్నారు. అనంతరం లబ్ధిదారుల ఖాతాల్లో ఆర్థిక సహాయం జమ చేయనున్నారు.

**అన్నింటికీ ఆసరా**

వాహనానికి బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికేట్, చిన్నపాటి మరమ్మతులకు వైఎస్సార్ వాహనమిత్ర పథకం ఆసరాగా నిలుస్తుంది. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేత హోదాలో వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి నిర్వహించిన పాదయాత్రలో చిన్న వాహనాల యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూశారు. వారికి మేలు చేయాలనే ఉద్దేశంతో వైఎస్సార్ వాహన మిత్రను ప్రవేశపెడాతానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఏటా క్రమం తప్పకుండా వైఎస్సార్ వాహనమిత్ర పథకాన్ని అమలు చేస్తున్నారు. వాహన యజమానులను ఆదుకుంటూ ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితులలో కూడా తమ ఖాతాలో ఆర్థిక సహాయం జమ చేశారని పలువురు లబ్ధిదారులు గుర్తు చేసుకుని ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

**లబ్ధి చేకూరిందిలా.. (రూ.కోట్లలో)**

| ఏడాది | లబ్ధిదారులు | ఆర్థిక సాయం |
|---|---|---|
| 2019 | 8122 | 8.12 |
| 2020 | 11,913 | 11.91 |
| 2021 | 8,446 | 8.44 |
| 2022 | 11,233 | 11.23 |
| 2023 | 11,819 | 11.81 |

**ఐదు విడతల్లో లబ్ధి**

జిల్లాలో వైఎస్ఆర్ వాహన మిత్ర పథకం కింద ఐదు విడతల్లో 51533 మందికి లబ్ధి చేకూరింది. పథకాన్ని ప్రారంభించినప్పటినుంచి వరుసగా నాలుగేళ్లుగా ఆటో డ్రైవర్లకు ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం క్రమం తప్పకుండా జమ చేస్తున్నారని ఆటోడ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన ఆటో డ్రైవర్ల నుంచి రవాణాశాఖాధికారులు దరఖాస్తులను ఆహ్వానించారు. నిశితంగా పరిశీలించి అర్హులందరికీ పథకం వర్తించేలా ఎంపిక చేశారు. ఈ ఏడాది 11819 మంది లబ్ధిదారులను గుర్తించారు. వీరికి రూ.11.81 కోట్ల మేర లబ్ధి చేకూరుతోందని ఆర్టీఏ వర్గాలు వెల్లడించాయి.

### కోవిడ్ సమయంలో ఆదుకున్నారు



రెండేళ్ల పాటు కోవిడ్ సమయంలో చాలా కష్టాలు పడ్డాం. ఆటో వ్యాపారం ఉండేది కాదు. ఉన్నా నిబంధన మేరకు ఇద్దరికి మించి ఎక్కేవారు కాదు. అటువంటి సమయంలో వైఎస్సార్ వాహన మిత్ర పథకం బాగా ఉపయోగపడింది. పాదయాత్రలో మా కష్టాలను చూసిన వైఎస్ జగన్ అధికారంలోకి వస్తే ఆర్థిక సాయం అందేలా చూస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల కాలంలో ఈ పథకాన్ని ప్రారంభించారు. క్రమం తప్పకుండా ఐదో ఏడాది కూడా పథకం అమలు చేసి మాలాంటి వారిని ఆదుకున్నారు.

– ఎం.బాబురావు, ఆటో యాజమాని

### ఐదోసారీ లబ్ధి



ఆటో డ్రైవర్లకూ కష్టాలుంటాయని గుర్తించిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఆటోలు నడుపుకూంటూ కుటుంబాన్ని పోషించుకునే మాలాంటి వారికి ఆర్థిక సహాయం అందజేయాలని ఆలోచించడం గొప్ప విషయం. ఏడాది పొడవునా ఆటోకు వచ్చే మరమ్మతులు ఈ సొమ్ముతో చేయించుకుంటున్నాం. ఏ ప్రభుత్వమూ ఆటో డ్రైవరును పట్టించుకోలేదు. ఒక్క జగనన్న ప్రభుత్వమే మాకు సహాయం అందజేస్తోంది. నాలుగుసార్లు క్రమం తప్పకుండా అందుకున్నాను. ఐదవ విడతకు వస్తుందని తెలిసి ఆనందంగా ఉంది.

– వేమగిరి భాస్కరరావు, వాహన యాజమాని

### ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ప్రతిపక్ష నాయకుడి హోదాలో పాదయాత్ర చేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అప్పట్లో ఆటో కార్మికులు కలిసి కష్టాలు చెప్పారు. వెంటనే ఆయన స్పందించారు. అధికారంలోకి వస్తే తప్పకుండా మేలు చేస్తానని ప్రకటించారు. మాట నిలబెట్టుకుని వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా మా లాంటి ఆటోవాలాకు సహాయ పడుతున్నారు. అర్హత ఉంటే ఏటా రూ.10వేలు పథకం కింద మా ఖాతాలకు జమ చేస్తున్నారు. మాలాంటి వారికి ఈ పథకం చాలా తోడ్పడింది. ఆటోకు సంబంధించి ఇన్సూరెన్స్, పొల్యూషన్, ఫిట్‌నెస్ వంటివి కట్టుకోడానికి ఈ మొత్తం ఆసరాగా నిలిచింది.

– నాయుడు పట్టాభి, వాహన యాజమాని

### ప్రతిష్టాత్మకంగా అమలు



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతి ష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ వాహన మిత్ర పథ కాన్ని జిల్లాలో లబ్ధిదారులందరికీ చేరేవిధంగా చర్యలు చేపట్టాం. ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్ల నుంచి దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా ఆహ్వానించి వచ్చిన దరఖాస్తులను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఈ పథకం అందేలా కృషి చేశాం. ఈ నెల 29న ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో కార్యక్రమం నిర్వహించి వాహన మిత్ర 5వ విడత నగదు జమ చేయడం జరుగుతుంది. ఈ పథకం వల్ల ఆటోడ్రైవర్లకు ఎంతగానో ఆర్థికంగా ఊరట లభిస్తోంది.

– కృష్ణారావు, జిల్లా రవాణా శాఖాధికారి, రాజమహేంద్రవరం

### ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ప్రణాళిక



సమీక్ష నిర్వహిస్తున్న జేసీ తేజ్ భరత్

రాజమహేంద్రవరం సిటీ: జగనన్న ఆరోగ్య సురక్ష, రీసర్వే ఫేజ్3, హౌసింగ్‌కు సంబంధించి లక్ష్యాల సాధనకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు జాయింట్ కలెక్టర్ ఎస్. తేజ్ భరత్ అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ జిల్లాలో భూముల రీసర్వేకు చెందిన ఫేజ్ 2లో 54 గ్రామాల్లో ఫైనల్ ఆర్వోఆర్, కరెక్షన్ మాడ్యుల్ పూర్తి చేశామన్నారు. సరిహద్దు రాళ్ల ఏర్పాటుకు సంబంధించి 53,552 లక్ష్యాలను వందశాతం సాధించామన్నారు. పంచాయతీ రాజ్‌కు చెందిన మూడు పీహెచ్‌సీ భవనాలను పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామీణ పరిధిలో కొత్తగా ఐదుచోట్లకు సంబంధించి నాలుగు భవనాల నిర్మాణ అగ్రిమెంట్లు పూర్తి చేశామని, పట్టణ పరిధిలో తొమ్మిది యూపీహెచ్‌సీలకు గాను ఐదు అందజేశామని, మిగిలిన నాలుగు భవనాల నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 30 నాటికి పంట నమోదు పూర్తి చేసి, సామాజిక తనిఖీ కోసం ఆర్బీకేల వద్ద అక్టోబర్ 5 నుంచి 10 వరకూ ప్రదర్శిస్తామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఇంటింటి సర్వే చురుగ్గా సాగుతోందన్నారు. హౌసింగ్‌లో మార్పు చేసిన లక్ష్యాల మేరకు 19,253 ఇళ్ల నిర్మాణాలకు 14,372 స్టేజ్ కన్వర్షన్‌లో, 36,767 బేస్‌మెంట్ స్థాయికి ముందు ఉన్నాయన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన చోట ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

### నేడు అర్బన్ మండలంలో జగనన్నకు చెబుదాం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం అర్బన్ మండల ప్రజల నుంచి శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీలను స్వీకరించనున్నారు. జిల్లా కలెక్టర్ డా కె. మాధవీలత గురువారం ఒక ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఉదయం 10.30 నుంచి అర్జీలను స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## జగనన్న సారథ్యంలో బీసీలకు అగ్రాసనం

- బీసీల సంక్షేమానికి సీఎం జగన్ ప్రాధాన్యత
- బీసీ ముఖ్య నేతల సమావేశంలో ఎంపీ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో పిల్లి సుభాస్ చంద్రబోస్

రాజమహేంద్రవరం సిటీ: ఇప్పటి వరకూ అన్ని పార్టీలకూ బోయిలుగా ఉన్న బీసీలు ఇకపై పల్లకీలో కూర్చొనే రోజులు ఆసన్నమయ్యాయని ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గురువారం నగరంలోని మల్లయ్యపేట వైభవ్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను అధ్యక్షతన బీసీ ముఖ్య నేతల సమావేశం జరిగింది. వైఎస్సార్‌సీపీ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్ చంద్రబోస్‌తో కలసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ గడచిన ఏడున్నర దశాబ్దాలలో సంక్షేమం, రాజకీయ ప్రాధాన్యతల విషయంలో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఏ ప్రభుత్వం యోచించలేదన్నారు. సీఎం జగన్ ఒక్కరే ఈవెనుకబాటు తనాన్ని గుర్తించి అగ్రాసనం ఇచ్చి ప్రోత్సహిస్తున్నారన్నారు. బీసీలపై ఎనలేని అభిమానం చూపిస్తున్నారన్నారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్లుగా కూడా బీసీలకే పట్టం కట్టడం జగనన్నకు ఉన్న అభిమానానికి తార్కాణమన్నారు. వచ్చే నెలలో జరిగే బీసీ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. చంద్రబాబు నాయుడు పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి రాష్ట్ర ప్రజలకు తీరని ద్రోహం చేశారన్నారు. ఖజానాను అడ్డంగా దోచేశారన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్మెంట్) పేరిట వందల కోట్లు దిగమింగారని కోర్టులు సైతం ఆయనను రిమాండ్ లో ఉంచాయన్నారు. చంద్రబాబు అక్రమాలు ఒకటీ రెండూ కాదని తవ్వే కొద్దీ అనేక అవకతవకలు, భారీగా వేల కోట్లు దోచేసిన వైనాలు వెలుగు చూస్తున్నాయన్నారు. ఈ స్కాంల వెనుక చంద్రబాబు ఒక్కరే కాదని ఆయన తనయుడు లోకేష్ కూడా ఉన్నట్టు సీఐడీ దర్యాప్తులో వెలుగు చూసిందన్నారు. అందుకే లోకేష్‌పై కూడా సీఐడీ కేసులు ఫైల్ చేసిందన్నారు. ఈకార్యక్రమంలో సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

- జేఆర్ఎం ఫౌండేషన్ నిర్వాహకురాలు డాక్టర్ రాజశ్రీ
- వెదుళ్లపల్లిలో వైద్యశిబిరం



వైద్య శిబిరానికి తరలివచ్చిన రోగులు



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ రాజశ్రీ

రాజానగరం: గ్రామీణ ప్రాంతాల ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతుంటారని, వారికి సకాలంలో వైద్యసేవలు అందిస్తే వ్యాధి ఎక్కువ మందికి సోకకుండా నిరోధించవచ్చని జక్కంపూడి రామ్మోహనరావు (జేఆర్ఎం) ఫౌండేషన్ నిర్వాహకురాలు డాక్టర్ రాజశ్రీ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీతానగరం మండలం వెదుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ రాజానగరాన్ని ఆరోగ్య నియోజకర్గంగా తీర్చిదిద్దాలనే ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సంకల్పం మేరకు జేఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో తరచూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత ఏడాది క్యాన్సర్‌పై యుద్ధం పేరిట ఆ వ్యాధి బాధితులను గుర్తించి, వైద్యం అందించేందుకు జీఎస్ఎల్ సహకారంతో గ్రామాలలో శిబిరాలు నిర్వహించామన్నారు. ఏడాది పాటు ఉచితంగా వైద్య సేవలు అందించామన్నారు. వైఎస్సార్-జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్ బ్యాంకు ద్వారా అవసరమైన వారికి రక్తాన్ని అందిస్తున్నామన్నారు. అనారోగ్యానికి గురైన పేదలకు అక్షయ సంజీవని పథకం ద్వారా మెడిసిన్ కిట్లు, ఆహారం ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నామన్నారు.

**750 మందికి వైద్య పరీక్షలు**

సీతానగరం మండలం రాపాక, ముగ్గళ్ల, నల్గొండ, ఇనగంటివారిపేట, రాజంపేట, వెదుళ్లపల్లి, మునికూడలి, కూనవరం, కాటవరం, బొబ్బిల్లంక, ములకల్లంక, మిర్తిపాడు, ఉండేశ్వరపురం, తదితర గ్రామాల నుంచి శిబిరానికి రోగులు భారీగా తరలివచ్చారు. డాక్టర్ రాజశ్రీ పర్యవేక్షణలో రాజమహేంద్రవరంలోని డెల్టా ఆస్పత్రి సహకారంతో 40 మంది వైద్యులు సేవలు అందించారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గుండె వైద్యం, స్త్రీల వైద్యం, చిన్నపిల్లల వైద్యం, చర్మవ్యాధులు, మూత్రకోశ వ్యాధులు, నరాలు, కిడ్నీ వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, ఛాతీ, ఊపిరితిత్తులు, ఎముకలు, కంటి, దంత తదితర సమస్యలపై 750 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేయడంతో పాటు శస్త్ర చికిత్సలు చేయాల్సిన వారికి అందుకు కావాల్సిన ఏర్పాట్లు కూడా చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ సత్యం, మదన మోహన్, ఇనగంటివారిపేట సర్పంచ్ సత్యం రాంపండు, వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ కరుటూరి హరిబాబు, నాయకులు కవల కృష్ణమూర్తి, కవల దుర్గం, ఆకుల అబ్బన్న, కొల్లి చిరంజీవి పాల్గొన్నారు.


# గుండె లయ తప్పుతోంది

- ముందస్తు సంకేతాలను నిర్లక్ష్యం చేస్తే ముప్పే
- హెచ్చరికలపై అందరికీ అవగాహన తప్పనిసరి
- ఏటేటా పెరుగుతున్న గుండెపోటు బాధితులు
- నేడు గుండె వ్యాధుల నివారణ దినోత్సవం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: గుండె లయ తప్పుతోంది. పని ఒత్తిళ్లు..జీవనశైలిలో మార్పులు...ఆహారపు అలవాట్లు వెరసి ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. నిర్లక్ష్యం చేస్తే గుండెకు ముప్పు పొంచి ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అప్పటి వరకు బాగానే ఉన్నారు.. హఠాత్తుగా హార్ట్ ఎటాక్ వచ్చి కుప్పకూలిపోయారు అంటుంటారు...కానీ,గుండెపోటు వచ్చిన వారిలో కనీసం సగం మందిలో ముందస్తు హెచ్చరికలు లేదా సంకేతాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. వాటిని గుర్తించకపోవడమే ఈ ప్రమాదాలకు కారణమంటున్నారు. ఈ హెచ్చరికలపై అవగాహన కలిగి ఉండటం చాలా అవసరమంటున్నారు. ఇటీవల వయసుతో సంబంధం లేకుండా గుండె పోట్లుతో మరణాలు సంభవిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. గుండె కండరాల భాగం తగిన స్థాయిలో రక్తం పొందలేని అసాధారణ స్థితిలో గుండె పోటు ప్రమాదం ఉంటుంది. ఈ ముప్పు మహిళలతో పోల్చుకుంటే పురుషుల్లోనే అధికమని ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ ఏఎల్ సత్యవతి చెబుతున్నారు. మహిళల్లో ఈస్ట్రోజన్ హార్మోన్ ఉంటుందనీ.. రుతుస్రావం సమయంలో ఇది రక్తంలో కలిసి గుండె రక్షణకు దోహదపడుతుందని చెబుతున్నారు. 45 ఏళ్ల వయసు వరకు గుండె పోటు ముప్పు మహిళలు, పురుషుల నిష్పత్తి 1:10 గా ఉండటం గమనార్హం. పురుషుల్లో ఈ ముప్పు అధికంగా ఉండటానికి దురలవాట్లతో పాటు పనిఒత్తిళ్లు, ఆహారపు అలవాట్లు, జీవనశైలి కారణమవుతున్నాయి. వీటితోపాటు 20 నుంచి 50 ఏళ్ల వయసున్న వారిలో వ్యాయామం లేకపోవడమూ కారణమవుతోంది. అమెరికా యూరోప్ వంటి దేశాలతో పోలిస్తే మన ప్రాంతంలో గుండె జబ్బులు జన్యుపరమైన కారణాలతో ఎక్కువగా నమోదవుతున్నాయి.గుండె రక్తనాళాల్లో చేరిన పూడికల మీద హఠాత్తుగా రక్తం గడ్డకట్టి రక్తనాళాన్ని పూర్తిగా మూసివేసి గుండెపోటుకు దారితీస్తుందంటున్నారు. చాలా మందిలో ఈ పూడికలు 70 శాతం కన్నా ఎక్కువగానే ఉంటే గుండెపోటుకు దారితీస్తుంది.

**ఈ లక్షణాలున్నాయా..**

- పనిచేసినప్పుడు లేదా, నడిచినప్పుడు ఛాతి బరువు, మంట, ఛాతి భాగంలో పట్టినట్టు ఉండటం, ఎడమ భుజం దవడ, ఎడమ చేయి నొప్పి ఉంటాయి.
- డయాబెటిస్ ఉన్న వారిలో నొప్పి లేకుండా కేవలం ఆయాసం మాత్రం ఉండొచ్చు.
- మహిళల్లో కేవలం 30 శాతం మందిలో మాత్రమే ఛాతి నొప్పి ఉంటుంది.
- వేగంగా నడవడం, మెట్లు ఎక్కడం, బరువులు మోయటం వంటి పనులు చేస్తున్నప్పుడు గుండెకు మూడు నుంచి ఐదు రెట్లు రక్తసరఫరా అవసరం.



- సహజంగా ఆయాసం వస్తే అది గుండె సంబంధించిన లక్షణంగా అనుమానించాలని చెబుతున్నారు.
- పూడికలు ఎక్కువైనప్పుడు నీరసం పెరిగి చిన్న చిన్న పనులు కూడా చేయలేకపోయే సందర్భంలో అది గుండె సంబంధించిన లక్షణంగా పరిగణించాలంటున్నారు.
- గుండె నొప్పి ఎడమ దవడ నుంచి బొడ్డు వరకు ఎక్కడైనా రావచ్చు అంటున్నారు.
- కొన్నిసార్లు దవడ నొప్పి, ఎడం భుజం నొప్పి, పొట్ట భాగంలో వస్తున్నప్పుడు నిర్లక్ష్యం చేయవద్దంటున్నారు.
- 40 సంవత్సరాలు దాటిన వారిలో నిర్లక్ష్యం మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**జిమ్ కసరత్తుపై అవగాహనేదీ**

కోవిడ్ అనంతరం హృద్రోగాలు పెరిగాయని లెక్కలు చెబుతున్నా అవన్నీ మరణాలకు దారితీస్తున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని ప్రముఖ వైద్యులు ఐవీ రావు పేర్కొంటున్నారు. కోవిడ్ వైరస్ శరీరంలో అన్ని భాగాలలోకి చొచ్చుకెళ్లడం రక్తం చిక్క దనానికి కారణమవుతుందంటున్నారు. జిమ్‌లో చేసే వర్క్ అవుట్‌ల పట్ల అవగాహన లేకపోతే ప్రమాదం తప్పదని హెచ్చరిస్తున్నారు. అతిగా ఆయాసపడే వర్క్ అవుట్లను నియంత్రించాలంటున్నారు. చెమట ఎంతైతే పోతోందో ఆ మేరకు నీరు తాగాల్సి ఉంటుంది. సోడియం స్థాయి పడిపోకుండా చూసుకోవడంతో పాటు మద్యం ,ధూమపానం, మాదక ద్రవ్యాల వినియోగం వ్యాయామాల వేళ ముప్పును పెంచుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**పెరుగుతున్న హృద్రోగ బాధితులు**

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోనే అతి పెద్ద ఆస్పత్రి కాకినాడ జీజీహెచ్. ఈ ఆస్పత్రిలో వారంలో మూడు రోజుల పాటు (సోమ, బుధ శుక్ర) ఓపీ సేవలు, వారం అంతా హృద్రోగ అత్యవసర సేవలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం 40 పడకలతో ఐసీయూ ఏర్పాటు చేసింది. ప్రతి నెలా ఒక్క జీజీహెచ్‌కు 300 నుంచి 400 ఇన్‌పేషెంట్లు(ఐపీ), ప్రతి వారం 300 నుంచి 360 మంది మధ్య గుండె జబ్బులతో జీజీహెచ్‌కు వస్తున్నారు. ఈ సంఖ్య పెరుగుతోందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**జీజీహెచ్‌లో గడచిన ఐదు వారాల గణాంకాలు**

| ఎప్పుడు | ఓపీ | ఐపీ |
|---|---|---|
| ఆగస్టు చివరి వారం : | 302 | 65 |
| సెప్టెంబర్ తొలివారం : | 311 | 77 |
| సెప్టెంబర్ రెండవ వారం : | 337 | 81 |
| సెప్టెంబర్ మూడవ వారం : | 322 | 98 |
| సెప్టెంబర్ చివరి వారం : | 361 | 118 |

### త్వరలో క్యాథ్ ల్యాబ్



జీజీహెచ్లో గుండె చికిత్సకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. మందుల కొరత ఏమీ లేదు.రక్త నాళాల్లో గడ్డ కట్టిన రక్తాన్ని కరిగించేందుకు వినియోగించే రూ.45 వేలు ఖరీదైన టెనిక్‌టిప్లేజ్ ఇంజక్షన్‌తోపాటు ఇతర మందులన్నీ అందుబాటులో ఉన్నాయి. వెంటిలేటర్ ఉండడంతో ప్రమాదకరమైన స్థితి నుంచి కోలుకుంటున్నారు. జీజీహెచ్‌లో త్వరలో క్యాథ్ ల్యాబ్ సిద్ధమవుతోంది. ఇంటర్ వెన్షన్లు, స్టంట్లు సహా కీలకమైన హృదయ సంబంధిత వైద్య సేవలన్నీ సామాన్యులకు అందుబాటులోకి రానున్నాయి.

– డాక్టర్ లావణ్యకుమారి, సూపరింటెండెంట్.కాకినాడ జీజీహెచ్.

### గుండె ముందే చెబుతుంది

గుండెపోటు వచ్చిన వారిలో కనీసం సగం మందిలో ముందస్తు హెచ్చరిక లు, సంకేతాలు ఉంటాయి. చిన్న చి న్న సంకేతాలను విస్మరించకూడదు. గుండె జబ్బుల పై అవగాహన అవసరం. కొన్నిసార్లు గుండెపోటు హఠాత్తుగా ముందస్తు లక్షణాలు ఏమీ లేకుండానే రావచ్చు. కొందరికి హెచ్చరిక సంకేతాలు కనిపించవచ్చు. సంకేతాలు గురించి అవగాహన ఉండటం ఎంతో అవసరం. గుండెపోటుకు ప్రధాన కారణం గుండెకు సంబంధించినటువంటి రక్తనాళాల్లో పూడిక లు చేరి, ఆ పూడికల మీద హఠాత్తుగా రక్తం గడ్డకట్టి రక్తనాళాన్ని పూర్తిగా మూసివేసి గుండెపోటుకు దారితీస్తుంది.

– డాక్టర్ కొల్లూరు లక్ష్మణ్, కార్డియాలజిస్ట్, రాజమహేంద్రవరం

## క్లుప్తంగా

### గల్లంతైన యువకుడి మృతదేహం స్వాధీనం


రాకేష్ మృతదేహం

ఆలమూరు: మండలంలోని మడికి వెంబడి ప్రవహిస్తున్న తూర్పు డెల్టా ప్రధాన కాలువలో గల్లంతైన అత్తిలి రాకేష్ (22) మృతదేహాన్ని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా కాలువలో స్నానానికి వెళ్లిన రాకేష్ గల్లంతయ్యాడు. దీంతో పోలీసులు, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టగా గల్లంతైన ప్రదేశానికి సమీపంలో మృతదేహానిగుర్తించారు. దీంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీనివాస నాయక్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### చికిత్స పొందుతూ వివాహిత మృతి

అయినవిల్లి: మండలంలోని నేదునూరు గ్రామంలో బొంతువారిపాలెంలో ఓ వివాహిత కడుపునొప్పి తాళలేక గడ్డి మందు తాగింది. రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. దీనికి సంబంధించి ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అయినవిల్లి నేదునూరు బొంతువారి పాలేనికి చెందిన బొంతు సత్యవేణి(40) ఈ నెల 26న కడుపునొప్పి తాళలేక గడ్డి మందు తాగింది. అది గమనించిన ఆమె కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరంలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆమెకు భర్త దొరబాబు, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరి మృతి

- మరో ఇద్దరికి గాయాలు
- వాకతిప్పలో విషాదం


పేలుడు ధాటికి ఛిద్రమైన ఇల్లు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్



మృతులు శ్రావణి, చినబాబు (ఫైల్)


గాయాలపాలయిన అమ్మాజీ, అజయ్

పిఠాపురం/కొత్తపల్లి: కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం వాకతిప్పలో గురువారం ఉదయం గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. పిఠాపురం సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఆదిలక్ష్మి అమ్మవారి గుడి సమీపంలో మామిడి మల్లిబాబు..మరో ఇద్దరు అన్నదమ్ములు ఒకే ఇంట్లో వేరు వేరుగా కుటుంబాలతో నివాసముంటున్నారు. మల్లిబాబు ఇంటిలో గురువారం మధ్యాహ్నం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ గ్యాస్ సిలిండరుకు నిప్పు అంటుకుంది. ఒక్క సారిగా మంటలు వ్యాపించాయి. దీంతో ఇంట్లో ఉన్నవారు బయటకు వచ్చే లోపే పెద్ద శబ్దంతో సిలిండర్ పేలిపోయింది. అప్పటికే మల్లిబాబు మనుమరాలు చేతిపువ్వు సూర్యచక్ర శ్రావణి(13) గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందింది. మల్లిబాబు కుమారుడు చిన్నయ్యదొర(27)తోపాటు అమ్మాజీ, అజయ్ తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన జరుగుతున్న సమయంలో వినాయక నిమజ్జన ఊరేగింపు వెళుతోంది. భారీ శబ్దం, మంటలు చూసి ఊరేగింపులో ఉన్న వ్యక్తులు పరుగున వెళ్లి ఇంట్లో ఉన్న వారిని రక్షించేందుకు ప్రయత్నించారు. అప్పటికే సూర్య చక్ర శ్రావణి కాలి పోయి విగత జీవిగా పడి ఉంది. క్షతగాత్రులను వెంటనే కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చినబాబు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం తుది శ్వాస విడిచాడు. మరో ఇద్దరికి చికిత్స అందజేస్తున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి. ఒకే ఇంట్లో పక్కపక్కనే మామిడి మల్లిబాబు భార్య, ఇద్దరు కుమారులు, ఆయన తమ్ముడు మామిడి సుబ్బారావు భార్య కుమారుడు, వారి వదిన వరలక్ష్మి వేరు వేరు గదుల్లో నివాసముంటున్నారు. పేలుడు ధాటికి ఇంట్లో రెండు గదులు ధ్వంసమయ్యాయి. ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో ఆ ఇంట విషాదం అలముకుంది. జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ పేలుడు జరిగిన ఇంటిని పరిశీలించారు. కొత్తపల్లి ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**బడికెళితే బతికేదేమో..!**

ప్రమాదంలో మృత్యువాత పడిన చేతిపువ్వు సూర్య చక్ర శ్రావణి (13) వాకతిప్ప హైస్కూలులో తొమ్మిదో తరగతి చదువుకుంటోంది. ఆమె తల్లిదండ్రులు భవాని, శ్రీను పెద్దాపురం మండలం తూర్పుపాకలులో ఉంటుండగా శ్రావణి తన అమ్మమ్మ గారి ఇంటి వద్ద ఉండి చదువుకుంటోంది. గురువారం సెలవు కావడంతో ఇంటి దగ్గరే ఉంది. వారి ఇంటి పక్కనే వినాయక ఉత్సవంలో భాగంగా అన్నదానం జరుగుతుంటే స్నేహితులతో కలిసి భోజనానికి వెళ్లింది. భోజనాలు చేసాక కాసేపు ఇక్కడే ఉండి వెళదామని స్నేహితులు చెప్పగా ఇంట్లో పని ఉందని, వెళ్లి పోతానని చెప్పి ఇంటికి వెళ్లింది. ఆమె వెళ్లిన కొద్ది సేపట్లోనే ప్రమాదం సంభవించి అగ్నికి ఆహుతి అయ్యి అకాల మరణం పొందడం ఆమె స్నేహితులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఎంతో చలాకీగా ఉండే శ్రావణి సెలవు లేకపోతే బడిలో ఉండి బతికి ఉండేదని స్నేహితులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రమాదంలో మృతి చెందిన మామిడి చిన్నయ్య దొర అలియాస్ చినబాబు కాకినాడలో ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. స్థానికంగా వినాయక ఉత్సవంలో బాగంగా అన్నదానం జరుగుతుండడంతో పాటు స్నేహితులతో కలిసి అన్నదానంలో పాల్గొనడానికి ఉద్యోగానికి సెలవు పెట్టి ఇంటి వద్దే ఉండిపోయాడు. అప్పటి వరకు అన్నదాన కార్యక్రమంలో వడ్డన చేసిన చినబాబు అప్పుడే టీ తాగి వస్తానంటూ ఇంటికి వెళ్లాడు. కొంతసేపటికే ప్రమాదానికి గురై మృత్యువాత పడడంతో అతని తల్లిదండ్రులు హృదయ విదారకంగా విలపిస్తున్న తీరు చూపరులకు కంటతడి పెట్టించింది.

**బయటకు వెళ్లినవారు బతికారు**

ఆ ఇంట్లో నివాసముంటున్న మూడు కుటుంబాల్లో మొత్తం పది మంది ఉంటుండగా ప్రమాదం సంభవించిన సమయంలో ఇంట్లో ఉన్న ఐదుగురు ప్రమాదం బారిన పడ్డారు. మామిడి మల్లిబాబు, మామిడి సుబ్బారావు పని నిమిత్తం బయటకు వెళ్లగా మృతురాలి శ్రావణి తండ్రి శ్రీను వైద్య కోసం వాకతిప్ప వచ్చి గురువారం ఉదయాన్నే తన అత్తగారైన మామిడి వెంకటరమణమ్మతో కలిసి విశాఖపట్నం ఆస్పత్రికి వెళ్లాడు. మిగిలిన వారు ఇతర పనులపై బయట ఉండడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఒకే ఇల్లు కావడంతో పాటు మూడు పోర్షన్లు కలిసి ఉంటాయి. వాటిలో మధ్య పోర్షన్లో ప్రమాదం జరగడంతో ప్రమాద ధాటికి ఇంటి గోడలు సైతం ధ్వంసం అయి పక్క గదిలో ఉన్న మామిడి అమ్మాజీ సైతం తీవ్ర గాయాల పాలయ్యింది.

**టీ కాస్తుండగా ప్రమాదం**

మృతుడు చినబాబు గ్యాస్ స్టౌ వెలిగించి టీ పెట్టుకునే ప్రయత్నం చేయగా మంటలు చెలరేగి బయటకు పరుగులు తీసే ప్రయత్నం చేసే లోపే భారీ పేలుడు సంభవించింది. ఆ గదిలో ఉన్న చినబాబుతో పాటు శ్రావణి తీవ్ర గాయాల పాలయి మృత్యువాత పడ్డారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు 12 మంది

నేడు తెనాలిలో తలపడనున్న విద్యార్థులు


రాష్ట్ర హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

పెదపూడి: రాష్ట్ర స్థాయిలో జరిగే హ్యాండ్‌బాల్ పోటీలకు తమ పాఠశాల నుంచి 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారని శహపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.రవి, పీడీ ఎస్.శ్రీహరిరాజు తెలిపారు. ఆ పాఠశాల్లో విద్యార్థులను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్-14 బాలికల విభాగంలో వి.శశిదేవి, వి.తేజశ్రీదుర్గ, మణి, బాలుర విభాగంలో సాయికృష్ణ, వరప్రసాద్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. అండర్-17 బాలికల విభాగంలో వి.శృతి, యుగశ్రీ, ఆర్.శైలజ, మౌలిక, మాధవి, బాలుర విభాగంలో చరణ్, ఎస్.మహేష్ ఎంపికయ్యారన్నారు. వీరంతా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. కాకినాడలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో జరిగిన పోటీల్లో వీరు ఎంపికయ్యారన్నారు. అండర్-17 బాలుర, బాలికలకు గుంటూరు జిల్లా తెనాలిలో ఏఎస్ఆర్ స్టేడియంలో శుక్రవారం జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.

# గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతులు

గణేశ్ నిమజ్జనం సందర్భంగా జరిగిన వేర్వేరు ఘటనల్లో అపశ్రుతులు చోటు చేసుకున్నాయి. నిమజ్జనం అనంతరం తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడగా, కాలువలో ఓ యువకుడు గల్లంతయ్యాడు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి గాయాలు


కాలువలో గాలింపు చర్యలు పర్యవేక్షిస్తున్న ఎస్సై బుజ్జిబాబు

కాకినాడ రూరల్: వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవంలో పాల్గొన్న భక్తులు తిరిగి ఇంటికి చేరకుండానే బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురవ్వడంతో ఒకరు మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ రూరల్ తూరంగి పగడాలపేట వద్ద బుధవారం రాత్రి 11గంటల ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో అదే గ్రామం యాళ్ళవారిగరువుకు చెందిన కామాడి లోవరాజు(43)మృతి చెందాడు. యువకుడు కొప్పాడి శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. యాళ్ళవారి గరువులోని చవితి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని సుమారు 10మంది రిక్షాపై చొల్లంగి వద్దకు బుధవారం తీసుకువచ్చారు. నిమజ్జనం తరువాత ఇంటికి చేరుకునేందుకు రిక్షాపై వస్తుండగా వెనక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రిక్షాపై ఉంచిన బల్లపై కూర్చున్న లోవరాజు కిందపడిపోవడంతో బలమైన గాయాలు అయ్యాయి. శ్రీనుకు కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. ఎంతో ఉత్సాహంగా నిమజ్జనోత్సవంలో పాల్గొని ఇంటికి వస్తున్న తరుణంలో చోటు చేసుకున్న ప్రమాదంతో ఆందోళనకు గురైన తోటి వారు వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న యాళ్లవారి గరువు, తూరంగి గ్రామానికి చెందిన వారు పెద్ద ఎత్తున గురువారం ఇంద్రపాలెం పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. మృతుడు లోవరాజు కుటుంబానికి న్యాయం చేయాలని పట్టుబట్టారు. ప్రమాదానికి కారణమైన లారీ యజమాని కొద్ది మొత్తంలో సహాయం చేస్తామన్నా ఒప్పుకోలేదు. మృతుడి కుటుంబానికి న్యాయం చేసే వరకు పోస్టుమార్టం జరగనీయబోమని అడ్డు చెప్పారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ శ్రీనివాస్ ఇంద్రపాలెం పీఎస్‌కు చేరుకుని మృతుడి తరఫున వచ్చిన వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఎస్సై దేవ సుధ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గల్లంతయిన రామారెడ్డి (ఫైల్)

### కాలువలో యువకుడి గల్లంతు

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి దుర్గమ్మ ఆలయం వద్ద బుధవారం రాత్రి జరిగిన గణపతి నిమజ్జనంలో కొమరిపాలెం గ్రామానికి చెందిన తేతలి నాగవీరవెంకటరామారెడ్డి (20) గల్లంతు అయ్యాడు. కొమరిపాలెం, తొస్సిపూడి గ్రామస్తులు అందరూ గణనాథుడిని ఊరేగింపుగా తీసుకువచ్చి ఈ రేవు వద్ద నిమజ్జనం చేయడం ఆనావాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా బుధవారం రాత్రి కొమరిపాలెం గ్రామం నుంచి వినాయకుడిని ఉరేగింపుగా తీసుకుచ్చారు. యువకుడు విగ్రహంతో పాటు వెళ్లి గల్లంతు అయ్యాడు. ఈత వచ్చని కాలువలోకి దిగిన యువకుడు ప్రవాహం వేగం రావడంతో ఈద లేక కొట్టుకుపోయాడు. స్థానికులు రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. పోలీసులు గురువారం గాలింపు చర్యలు చేపట్టినా మృతదేహం లభ్యం కాలేదు.

**విషాదంలో కొమరిపాలెం**

రామారెడ్డికి తండ్రి లేకపోవడంతో అన్న మణికంఠ రెడ్డి, తల్లి వెంకటలక్ష్మిలతో కలిసి కొమరిపాలెంలో నివాసం ఉంటున్నారు. రామారెడ్డి తల్లితోపాటు సూపర్‌బజార్‌లో పనిచేస్తున్నాడు. అందరితో సరదాగా ఉండే అతని మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టామమని ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు.

## సభలో తోక ముడిచి..
# బయట అసత్య ప్రచారం


ఎమ్మెల్సీ తోట సమక్షంలో పార్టీలో చేరిన కమల తదితరులు

- ప్రతిపక్ష ఎమ్మెల్యేల తీరుపై ఎమ్మెల్సీ తోట మండిపాటు
- మండపేటలో వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు

మండపేట: శాసనసభ సమావేశాల్లో నోరు మెదపకుండా తోక ముడిచిన ప్రతిపక్ష పార్టీ నేతలు ప్రభుత్వం ప్రతిపక్షం గొంతు నొక్కుతోందని బయట అసత్య ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మండిపడ్డారు. మాజీ సీఎం చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి పాల్పడకుంటే తమ వాణిని వినిపించేందుకు ప్రతిపక్ష ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు చట్టసభ కన్నా మించిన ప్రజావేదిక ఏముందని ప్రశ్నించారు. స్థానిక గొల్లపుంత కాలనీకి చెందిన మహిళా నేత పాలంగి కమల వంద మందికి పైగా తన అనుచరులతో కలిసి గురువారం ఎమ్మెల్సీ తోట సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుపై ప్రభుత్వం అక్రమంగా కేసులు బనాయించిందని ప్రతిపక్ష పార్టీలు, మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. కేసులు పెట్టేంత వరకే అధికారుల పరిధిలో ఉంటుందని, వాటిలో వాస్తవం ఉంటేనే కోర్టులు విచారణకు ఆదేశిస్తాయన్న విషయం ప్రజలకు తెలుసునన్నారు. రూ.కోట్లు వెచ్చించి ఢిల్లీ నుంచి ప్రముఖ లాయర్లను తీసుకువచ్చి తమ వాదనలు వినిపించినా కుంభకోణంలో చంద్రబాబు పాత్ర లేదని నిరూపించుకోలేకపోవడం వలనే ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు కోర్టులు నిరాకరించాయన్నారు. అవినీతి జరిగిందని రుజువైంది కాబట్టే చంద్రబాబు అరెస్టుపై ప్రతిపక్ష టీడీపీ కార్యకర్తల నుంచి స్పందన కరవైందన్నారు. నిరసన కార్యక్రమాల కోసం కిరాయికి డబ్బులిచ్చి బయట నుంచి జనాన్ని తెచ్చుకోవాల్సిన దుస్థితిలో ఆ పార్టీ ఉందన్నారు. చంద్రబాబు నిజాయితీపరుడైతే శాసనమండలి, అసెంబ్లీ సమావేశాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు ఎందుకు నోరు మెదపలేకపోయారని ప్రశ్నించారు. వారికి వాస్తవాలు తెలీడం వలనే తోక ముడిచారని విమర్శించారు. ప్రజల అభివృద్ధి సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్న పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, అందుకు ఎక్కడికక్కడ జరుగుతున్న చేరికలే నిదర్శనమన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం జగన్‌ను మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎమ్మెల్సీ తోట అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రాష్ట్ర నేతలు కర్రి పాపారాయుడు, రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# శ్రీనివాస్ ఫొటోకు గోల్డ్‌మెడల్



ఇంతియాజ్ నుంచి మెడల్, ప్రతిభా పురస్కారం అందుకున్న శ్రీనివాస్. గోల్డ్‌మెడల్ పొందిన ప్రభల తీర్థం ఫొటో

సఖినేటిపల్లి: మండల పరిధిలోని అప్పనరామునిలంకకు చెందిన ఫొటోగ్రాఫర్ నల్లి శ్రీనివాస్ తీసిన ఫొటోకు ప్రపంచ పర్యాటక దినోత్సవం పోటీలలో గోల్డ్‌మెడల్ దక్కింది. బుధవారం విజయవాడలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో గోల్డ్‌మెడల్, ప్రతిభా పురస్కారం ఆయన అందుకున్నారు. వివరాలు గురువారం మీడియాకు ఆయన చెప్పారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని విజయవాడలో ఏపీ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక శాఖ, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ సంయుక్తంగా ఒక కార్యక్రమం నిర్వహించాయి. ఏపీలోని ఆకర్షణ కలిగిన ప్రాంతాలు, పురాతన దేవాలయాలపై దేశవ్యాప్తంగా తెలిపేందుకు ఒక ఫొటోగ్రఫీ కాంపిటీషన్ సదరు సంస్థలు చేపట్టాయి. దీనికి కోనసీమలోని మామిడికుదురు మండల పరిధిలో కనుమ రోజున శ్రీనివాస్ తీసిన ప్రభల తీర్థం ఫొటోకు గోల్డ్‌మెడల్ దక్కింది. దీంతో ఏపీ రెవెన్యూ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జీ.సాయిప్రసాద్, సెర్ప్ సీఈవో, డైరెక్టర్ ఏపీ రాష్ట్ర మైనారిటీల సంక్షేమం ఏ.ఎండి.ఇంతియాజ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ క్రియేటివిటీ, కల్చరల్ కమిషన్ సీఈవో ఆర్.మల్లికార్జున రావు చేతులు మీదుగా మెడల్, ప్రతిభా పురస్కారం శ్రీనివాస్ అందుకున్నారు.

# పోలవరం కాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్య


నాగేశ్వరరావు మృతదేహం

నల్లజర్ల: అనంతపల్లి హైస్కూలు సమీపంలో పోలవరం కాలువలోకి దూకి ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లజర్ల ఎస్ఐ బి.నరసింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం దేవరపల్లి మండలం కృష్ణంపాలెం గ్రామానికి చెందిన తోరాటి నాగేశ్వరావు(40)కు నల్లజర్ల మండలం అనంతపల్లికి చెందిన సత్యవేణితో వివాహమైంది. వారికి ఒక పాప,బాబు ఉన్నారు. నాగేశ్వరావు కొంతకాలంగా అనంతపల్లి ఎన్టీఆర్ కాలనీలో అత్తవారింటికి సమీపంలోనే ఇల్లు అద్దెకు తీసుకుకొని వ్యవసాయ పనులు చేస్తూ ఉంటున్నాడు. కొద్దికాలంగా భార్యాభర్తల మధ్య వివాదాలు వచ్చి తరుచు ఘర్షణ పడుతున్నారు. బుధవారం రాత్రి కూడా అదేవిధంగా గొడవ పడ్డారు. భార్యతో పోలవరం కాలువలో దూకేస్తానని బెదిరించి వెళ్లి పోయాడు. ఉదయం చూసేసరికి నాగేశ్వరావు ఇంట్లో లేకపోవడంతో బంధువులు కాలువ పరిసరాల్లో వెదికారు. అచ్చన్నపాలెం సమీపంలో నాగేశ్వరావు మృతదేహాన్ని కనుగొన్నారు. నల్లజర్ల ఎస్సై బి.నరసింహమూర్తి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

# ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం


పి.గన్నవరంలో దగ్ధమైన ఎలక్ట్రిక్ బైక్

పి.గన్నవరం: స్థానిక మెయిన్‌రోడ్‌లో బుధవారం అర్ధరాత్రి ఒక షాపులో పార్కు చేసిన ఎలక్ట్రిక్ బైక్ దగ్ధమైంది. దీంతో షాపులో ఉన్న ఇన్వర్టర్, ఇతర సామాన్లు కాలిపోవడంతో రూ.లక్ష మేర నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన అడ్డగళ్ల వెంకట జయ రాంబాబు నాలుగు నెలల క్రితం సెకండ్ హ్యాండ్ ఎలక్ట్రిక్ బైక్‌ను కొనుగోలు చేసి, వినియోగిస్తున్నారు. బుధవారం రాత్రి ఎలక్ట్రిక్ బైక్‌ను తన షాపులో పార్కు చేసి, షాపు షట్టర్‌కు తాళం వేశారు. అర్ధరాత్రి సమయంలో షాపులో నుంచి పొగలు రావడాన్ని, సమీపంలో ఉన్న బ్రాందిషాపు నైట్ వాచ్‌మన్ గమనించాడు. పై భవనంలో ఉన్న షాపు యజమానికి, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు, స్థానికులు మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. షాపులోని ఇతర సామాన్లు కూడా దగ్ధమయ్యాయి.

## రైలు ఢీ కొని వ్యక్తి మృతి

సామర్లకోట: స్థానిక రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన ఇది. రైల్వే ఎస్సై బి.లోవరాజు కథనం ప్రకారం పీబీదేవం-బిక్కవోలు మధ్యలో మృతదేహం ఉన్నట్లు రైల్వే సూపరింటెండెంట్ బి.శ్రీధర్ ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా ప్రదేశానికి చేరుకున్నట్లు తెలిపారు. రైల్వే కెఎం నెంబరు 617/3-5 పోస్టుల మధ్య వ్యక్తి మృతదేహాన్ని గమనించామన్నారు. సమీప ప్రాంతంలో విచారణ చేసి, మృతుడు కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురానికి చెందిన పెదపూడి నాగ గంగసత్య శ్రీనివాసు(36)గా గుర్తించామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సామర్లకోట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి ఎస్సై లోవరాజు దర్యాప్తు చేస్తున్నారు.

## ఒకటో తేదీ నుంచి సాఫ్ట్‌బాల్ సెలెక్షన్లు

కాజులూరు: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల స్థాయిలో అక్టోబర్ ఒకటో తేదిన గొల్లపాలెంలో జరుగనున్న సీనియర్, పురుషులు, మహిళల సాఫ్ట్ బాల్ సెలెక్షన్లను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఆళ్ళగడ్డ నాగరాంప్రసాద్ కోరారు. గురువారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 16 నుంచి 18వ తేదీ వరకూ నంద్యాల జిల్లా ఆళ్ళగడ్డలో జరుగనున్న 10వ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనేందుకు అర్హులవుతారన్నారు. వయస్సు పరిమితి లేదని, ఎవరైనా ఈ సెలెక్షన్స్‌లో పాల్గొనవచ్చునన్నారు. హాజరయ్యే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజ్‌ఫొటోలు, జనన ధ్రువపత్రం, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఫామ్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సెలక్షన్ ప్రారంభమవుతుందని, క్రీడాకారులు గంట ముందే మైదానంలో ఉండాలన్నారు. వివరాల కోసం 99493 94568, 94914 42913 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చునన్నారు.

## పాముకాటుకు వ్యక్తి మృతి


మృతుడు రామకృష్ణ

ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలి గ్రామంలో గురువారం పాముకాటుకు వ్యక్తి మృతి చెందాడు. తిరుమాలి గ్రామానికి చెందిన దేశాల రామకృష్ణ(48) వ్యవసాయ కూలి పనులు చేస్తుంటాడు. రోజూ లాగే పొలం పనులకు వెళ్లగా పాముకాటుకు గురయ్యాడు. స్థానికుల సహకారంతో ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య దేవి, కుమారులు నూకరాజు, సత్తిబాబు ఉన్నారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.